

## ప్రియుడి నాలుక కొరికిన ప్రియురాలు..

ప్రేయసీ ప్రియులు ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం...ప్రేమతో ముద్దాడడం ఇవన్నీ ఘాటైన ప్రేమకు పరాకాష్ఠలు. ఇవి సర్వసాధారణం. కానీ అసాధారణమైన సంఘటన ఒకటి జరిగింది. ప్రేమగా దగ్గరకు వచ్చిన ప్రియుడి నాలుకను కసుక్కున కసితీరా కొరికేసిందా ప్రియురాలు. పైశాచికత్వానికి పరాకాష్ఠగా నిలిచిన ఈ సంఘటన వివరాలు...

బ్రిటన్‌కు చెందిన ట్రేసీ డేవిస్, మార్క్‌కోఫీల్‌లు ప్రేయసీ ప్రియులు. మార్క్‌కోఫీల్ పుట్టిన రోజు సందర్భంగా తనకో ముద్దు ఇవ్వమని డేవిస్ కోరింది. అందుకు అంగీకరించాడు మార్క్‌కోఫీల్. తీరా ముద్దు ఇవ్వడానికి వచ్చిన మార్క్ నాలుకను కసుక్కున కొరికేసి, ఆ ముక్కను కాస్త నేల మీద పడేసింది. లబోదిబో మంటూ కింద పడిన నాలుక ముక్కను తీసుకొని మార్క్‌కోఫీల్ డాక్టర్ దగ్గరికి వెళ్లినా లాభం లేకపోయింది. ఆ ముక్కను అతికించడం అసాధ్యమని డాక్టర్లు తేల్చేసారు. ప్రియుడి నాలుకను కొరికిన డేవిస్‌కు కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, డేవిస్‌ది అసాధారణమైన మనస్తత్వం కాదని, ఆమె వలన ఎవరికీ ఎలాంటి హాని జరగదని అన్నారు. అయితే ఆమె ఈ విధంగా ప్రవర్తించడానికి ఓ కారణముందని ఆయన వివరించారు. డేవిస్ ఆ సమయంలో మద్యం సేవించింది. దానితో పాటు ఓ బలమైన కారణం కూడా ఉంది. డేవిస్‌కు మార్క్‌కోఫీల్ ద్వారా తల్లి కావాలనే కోరిక బలంగా ఉంది. పలు సార్లు ఆమె తన కోరికను మార్క్ దగ్గర వ్యక్తం చేసింది. అయితే ఇంత వరకూ ఆమె కోరిక నెరవేరలేదు. ఆ అసంతృప్తి ఆమెకు చాలా బలంగా ఉంది. తనను తల్లిని చేయలేదన్న కోపం కూడా మార్క్ మీద ఉంది. ఇన్ని కారణాల వలన ఆమె ఈ విధంగా ప్రవర్తించింది తప్ప ఆమెది శాడిస్ట్ మనస్తత్వం కాదని జడ్జి స్పష్టం చేశారు. ఈ సంఘటనను స్థానిక పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రముఖంగా పేర్కొన్నాయి.

*

## 'సరసి'కత

వైశంపాయనుడు భార్యతో కలిసి ఓ సాహిత్య సభకెళ్లాడు. సుబ్బాయమ్మ గారి ఫ్రెండొకావిడ రాసిన నానీల పుస్తకం ఆవిష్కరణ జరిగింది ఆ సభలో. ఆ సభకు వచ్చిన కవయిత్రి గారి స్నేహితురాళ్లందరూ ఒకరి తర్వాత ఒకరు శాలువాలు కప్పి,ఆమెను అభినందిస్తున్నారు.

"అయ్యో, ఇలా చేస్తారని నాకు తెలియదండీ, లేకపోతే నేను కూడా ఓ శాలువా తెచ్చేదాన్నీ" అంటూ వాపోయింది సుబ్బాయమ్మ గారు.




## సన్మానం

"నువ్వేం వర్రీ కాకు, ముందు లైన్లో నిలబడు"అంటూ భార్యకి చెప్పి వెళ్లిపోయాడు వైశంపాయనుడు.

లైను కదిలి సుబ్బాయమ్మ గారి వంతు వచ్చేసరికల్లా పువ్వుల పువ్వుల శాలువా ఒకటి తెచ్చి, సుబ్బాయమ్మ గారి చేతిలో పెట్టి "కప్పెయ్, కప్పెయ్" అంటూ తొందర పెట్టి సన్మానం చేయించేశాడు వైశంపాయనుడు.

తిరుగు ప్రయాణంలో, అక్కడ సన్మానం జరిగిన చోట – అందరూ వెళ్లిపోయాక, హాలు వాచ్‌మన్ తలుపుల తాళాలు వేస్తూ డోర్ కర్టెన్ ఒకటి మాయం అయిపోయిందని లబోదిబో మన్నాడు. ఎలా పోయిందో అర్థం కాలేదతడికి.

*